తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు



బస్సులో ప్రయాణికులను తనిఖీ చేస్తున్న సీఐ

కదిరి టౌన్: పట్టణంలోని అనుమానాస్పద ప్రదేశాల్లో డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. సీఐ వి.నారాయణరెడ్డి, నల్లచెరువు ఎస్ఐ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి స్పెషల్ పార్టీతో కలిసి రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, నిర్జన ప్రదేశాలు, ఇతర ప్రదేశాల్లో క్షుణ్ణంగా సోదాలు చేశారు. రోడ్డు మీద జులాయిగా తిరిగే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



పుట్‌పాత్ పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ, కమిషనర్

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని ఆర్డీఓ సువర్ణ, కమిషనర్ క్రాంతికుమార్ గుత్తేదారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి పట్టణంలో ఆర్టీసీ డిపో ఎదుట ప్రభుత్వం చేపడుతున్న పుట్‌పాత్ పనులను తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, సిబ్బందితో వె వెళ్లి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అందులో భాగంగా ఆర్టీసీ డిపో ఎదుట 250 మీటర్ల మేర రూ.10 లక్షల వ్యయంతో పుట్‌పాత్ నిర్మిస్తున్నామన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడకూడదన్నారు. నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించమని కాంట్రాక్టర్లను హెచ్చరించారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి



తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లచెరువు: ఆర్డీటీ సేవలను కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద నున్న ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి ఎమ్మార్పీస్ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నల్లచెరువు, వి. రమణప్పగారిపల్లి, ఉబిచర్ల, దిగువపల్లి ఎస్సీకాలనీ వాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల్లో చోటు



అమడగూరు: వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ విభాగాల కమిటీల్లో పలువురికి చోటు దక్కింది. అమడగూరు మండలానికి సంబంధించి 21 మందికి పలు విభాగాల్లో పదవులు కల్పిస్తూ సోమవారం రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు మండల కన్వీనర్ తనకంటి జయప్ప తెలిపారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా యష్‌పాల్, మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా గంగులమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా రామిరెడ్డి, బీసీ సెల్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గంగాద్రి, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అన్వర్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా సుధాకర్ రాజు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా మదన్ మోహన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం ప్రెసిడెంట్‌గా శంకర, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే వలంటీర్స్ వింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా విశ్వనాథ్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా విజయదేవరెడ్డి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా అశ్వనమ్మ, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా ఈశ్వరయ్య, సోషల్‌మీడియా వింగ్ అధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి, వికలాంగుల విభాగం అధ్యక్షుడిగా ఆంజనేయులు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా అమరనాథరెడ్డి పదవులు దక్కించుకున్నారు. పదవులు దక్కించుకున్న వారంతా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చేసే వరకు పోరాడతాం



తహసీల్దార్ కార్యాలయం బయట వంటా వార్పు చేస్తున్న సీపీఐ నాయకులు

ధర్మవరం: ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషియన్స్ కార్మిక సంఘం చేపట్టిన రిలే దీక్షలు సోమవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. పట్టణంలోని 650–2 సర్వే నంబర్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు. ప్లంబర్లకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం బయట సోమవారం రోడ్డుపై వంటా వార్పు చేపట్టి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 650–2 సర్వే నంబర్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కానీ ఏ ఒక్క అధికారి కూడా కార్మికుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆర్డీఓ ఈ విషయంపై విచారణ చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. దొంగ పట్టాలను రద్దు చేసి అర్హులైన ప్లంబర్స్ కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి రమణ, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషన్ కార్మిక సంఘం అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, తాజుద్దీన్, రామకృష్ణ, రామసుబ్బయ్య, సురేంద్ర, మసూద్, వేణుగోపాల్, ఓబులేసు, నాగేంద్ర, చిన్న, జనార్దన్, మహిళా సమాఖ్య నాయకులు లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



రాస్తారోకో చేస్తున్న కార్మికులు

గాండ్లపెంట: బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని స్వచ్ఛ భారత్ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 14 గ్రామపంచాయతీల్లోని స్వచ్ఛభారత్ కార్మికులు కదిరి – రాయచోటి ప్రధాన రహదారిలోని వైఎస్సార్ కూడలిలో రెండు గంటలపాటు రాస్తారోకో చేశారు. వేతనాల కోసం 15 రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి వారి వద్దకు వచ్చి రాస్తారోకో విరమించాలని కోరగా.. బకాయి వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారో తెలపాలని కోరారు. గ్రామ పంచాయతీలో ఉన్న నిధుల మేరకు పంచాయతీ కార్యదర్శులు వేతనాలు చెల్లిస్తారని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల సంవత్సరాల తరబడి వేతనాలు అందక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని సీఐటీయూ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే వంటవార్పుతో ఆందోళన చేపడతామన్నారు. ప్రయాణికులు ఇబ్బంది పడకూడదని రాస్తారోకో విరమిస్తున్న ట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు, కోశాధికారి సాంబశివ, నాయకులు ముస్తాక్, బాబ్‌జాన్, రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, కార్మికులు అక్కులప్ప, బాలక్రిష్ణ, ఆంజనేయులు, రమణమ్మ పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

పుట్టపర్తి: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం సోమవారం తెలిపింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నారు. బుక్కపట్నం మండల కేంద్రం షాదీఖానాలో మంగళవారం ఉదయం 9 గంటలకు కేక్ కట్ చేసి శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప తెలిపారు. అలాగే మండలంలో అనుబంధ విభాగాల అధ్యక్షులను ఘనంగా సన్మానిస్తామన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

అమడగూరు: మంగళవారం నిర్వహించబోయే మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకల్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తనకంటి జయప్ప పేర్కొన్నారు. అమడగూరు బస్టాండులోని వైఎస్సార్ విగ్రహం ఎదురుగా కేక్ కటింగ్ చేసి, సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.

ఓడీచెరువు: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఓడీచెరువు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద నిర్వహించనున్నట్లు కన్వీనర్ లక్ష్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిదులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

'నా కుమార్తెను అప్పగించండి'

రాప్తాడు: 'నా కుమార్తెను నా భర్త బంధువులు తీసుకెళ్లారు. వారి నుంచి నా కుమార్తెను తీసుకొచ్చి అప్పగించండి' అని రాప్తాడులో నివాసం ఉంటున్న ఆలూరు గీతాంజలి సోమవారం రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. ధర్మవరం టౌన్‌కు చెందిన ఆలూరు గీతాంజలి.. 3 నెలల నుంచి రాప్తాడులో నివాసం ఉంటోంది. తాడిపత్రికి చెందిన అరుణ్ తేజ్ అనే యువకుడితో 2017లో గీతాంజలి ప్రేమ వివాహం చేసుకుంది. వివాహం అయిన తర్వాత శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో కాపురం పెట్టారు. వీరికి ఒక చిన్నారి (పోస హన్విత అరుణ్) జన్మించింది. గీతాంజలి భర్త అరుణ్ తేజ్ మృతి చెందాడు. పోస హన్విత అరుణ్‌ను కొన్ని రోజులు తమ దగ్గర ఉంచుకుని తిరిగి పంపిస్తామని చెప్పి భర్త బంధువులు తీసుకెళ్లారు. కూమార్తె విషయంలో పలుమార్లు మా అత్త వాళ్లని సంప్రదించినప్పటికీ వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. నా కూమార్తె ఆచూకీ కనుక్కొని తనకు అప్పగించాలని గీతాంజలి ఫిర్యాదులో కోరింది.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

తనకల్లు: మండలంలోని కొక్కంటి క్రాస్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జాఫర్‌వలి, జిలానీ అనే దంపతులకు గాయాలయ్యాయి. వివరాలు... కదిరి చెందిన జాఫర్‌వలి, భార్య జిలానీతో కలిసి ద్విచక్ర వాహనంపై మదనపల్లికి బయల్దేరారు. అయితే కొక్కంటిక్రాస్ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పడంతో జాతీయ రహదారికి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జాఫర్‌వలి, అతని భార్య జిలానీకి తీవ్ర గాయాలయ్యాయి. వందేమాతరం టీం సభ్యులు ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను చికిత్స కోసం కదిరి ఆసుపత్రికి తరలించారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి

కనగానపల్లి: గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ అనిల్ కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతులైన తాగునీటి వసతి, పారిశుధ్య కార్యక్రమాలపై చర్చించారు. వీటితో పాటు ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

కదిరి అర్బన్: మండలంలోని కొలేపల్లి మెయిన్ రోడ్డునుంచి కొలేపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఆక్రమణలను ఎంపీడీఓ పోలప్ప సోమవారం తొలగింపజేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి శైలజ, సర్వేయర్లు అంబ్రిన్, ఆదర్శకుమార్, హమే రాలతో ఆక్రమణలు తొలగించి, హద్దులు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలకు నచ్చజెప్పి ఆక్రమణలను తొలగింపజేశారు.

కడప మీదుగా శ్రీశైలానికి బస్సు సర్వీసు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి కడప మీదుగా శ్రీశైలానికి బస్సు సర్వీసు నడుస్తుందని డీఎం మైనోద్దీన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సూపర్ లగ్జరీ బస్సు రోజూ రాత్రి 7:30 కదిరిలో బయల్దేరి ఉదయం 6:15 గంటలకు శ్రీశైలం చేరుతుందన్నారు. అదే రోజు రాత్రి శ్రీశైలంలో బయల్దేరి ఉదయం 5: 30 కదిరికి చేరుతుందన్నారు. కదిరి పులివెందుల, వేంపల్లి, కడప, మైదుకూరు, నంద్యాల మీదుగా శ్రీశైలానికి వెళ్తుందన్నారు. పెద్దలకు రూ.830, సీనియర్ సిటిజన్లకు రూ.630 చార్జీ ఉంటుందన్నారు.